

సైబర్ క్రైమ్ డీఎస్పీగానూతన బాధ్యతలు స్వీకరించిన రమేష్

- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసిన డీఎస్పీ

2 లో

సంగారెడ్డి మెదక్

శనివారం 07 నవంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:11



మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి

మరో ముందడుగు

మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి మరో ముందడుగు

- రైతులకుభరోసా,పేదలకు సంక్షేమ ఫలాలు అందించిన ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు

- రైతు సంక్షేమం, పేదల అభ్యున్నతే లక్ష్యం -- రామాయంపేట, నిజాంపేట మండలాల్లో

ఎమ్మెల్యే విస్తృత పర్యటన - వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం.. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- రైతు సంక్షేమం, పేదల అభ్యున్నతే లక్ష్యం -- - ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు



నవంబర్ 6 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి :

మెదక్ నియోజకవర్గ అభివృద్ధి, రైతుల సంక్షేమం, పేద ప్రజలకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందించడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. శుక్రవారం రామాయంపేట పట్టణం, నిజాంపేట మండల పరిధిలో ఆయన విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు వివిధ సంక్షేమపథకాల కింద అర్హులైనలబ్ధిదారులకుప్రయో జనాలను అందజేశారు.

మిగతా 2 లో



సుకన్య సమృద్ధి యోజన నమోదును నవంబర్ నెలలోగా పూర్తి చేయాలి



నవంబర్ 6 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి :

- జిల్లాకలెక్టర్ ప్రతిమా సింగ్

ఆడపిల్లల భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు వారి ఉన్నత విద్య, భవిష్యత్తు అవసరాలకు ఆర్థికంగా తోడ్పడే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లిసుకన్య సమృద్ధి యోజన (ఎస్ ఎస్ వై)లి పథకం కింద అర్హులైన బాలికలందరికీ ఖాతాలు ప్రారంభించేలా నవంబర్ నెలలో ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులనుఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సుకన్య సమృద్ధి యోజన అమలుపై అన్ని సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించరూ.

మిగతా 2 లో

జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- యువతలోని ప్రతిభను వెలికితీయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



నవంబర్ 6 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి :

యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, కళా నైపుణ్యాలు, ప్రతిభను వెలికితీసేందుకు జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు.శుక్రవారం, స్థానిక మెదక్ స్టేడియంలో అట్టహాసంగా జిల్లాస్థాయి యువజన ఉత్సవాలను అదనపు కలెక్టర్ నగేష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఉత్సవాల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనేలా విస్తృత ప్రచారం కల్పించాలని, గ్రామీణ , పట్టణ ప్రాంతాల యువతకు సమాన అవకాశాలు కల్పించాలని తెలిపారు.యువజన ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలు, పాటలు, వక్తృత్వ పోటీలు, చిత్రలేఖనం, కవితా రచన తదితర పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయడంతో పాటు, తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయాలని తెలిపారు.యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్సాహంగా పాల్గొనాలని అధికారులుపిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, పీడీలు, పీఈటీలు , క్రీడాకారులు పాల్గొన్నారు.

మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి మరో ముందడుగు

మొదటిపేజీ తరువాయి

రైతులకు మద్దతు ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యం:

ముందుగా రామాయంపేట పట్టణంలోని పిఎసిఎస్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పెద్దమ్మ టెంపుల్ వద్ద ఏర్పాటు చేసిన మరో పిఎసిఎస్ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ:

అనంతరం రామాయంపేట పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రామాయంపేట పట్టణం, మండల పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలు ఆర్థిక భారంగా మారకుండా ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమపథకాలప్రయోజనాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తాం:

అదే కార్యక్రమంలో రామాయంపేట పట్టణం, మండల పరిధిలో గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలనుఅందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నది ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. నిరుపేదలకు గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్నామని, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులతో పేదలకు ఆహార భద్రత:

రామాయంపేట పట్టణానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ కార్డులు పేద కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

చౌకత్‌పల్లిలో అభివృద్ధి పనుల ప్రారంభం:

అనంతరం నిజాంపేట మండల పరిధిలోని చౌకత్‌పల్లి గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, బోరు మోటారు, ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి మౌలిక వసతుల కల్పన ఎంతో అవసరమని అన్నారు. గ్రామపంచాయతీ భవనం ద్వారా ప్రజలకు పరిపాలనా సేవలు మరింత చేరువవుతాయని, బోరు మోటారు ద్వారా తాగునీటి అవసరాలకు ఉపశమనం లభిస్తుందని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో విద్యార్థులకు మెరుగైన, సురక్షితమైన విద్యా వాతావరణంఏర్పడుతుందని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు.

కల్వకుంట్లలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం:

అనంతరం కల్వకుంట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

నిజాంపేటలో స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ:

పర్యటనలో చివరిగా నిజాంపేట మండల రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లిఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావులిమాట్లాడుతూ.. పేదల సంక్షేమం, సామాజిక భద్రత, గ్రామీణ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యమని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

సుకన్య సమృద్ధి యోజన నమోదును నవంబర్ నెలలోగా పూర్తి చేయాలి

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ,, జిల్లాలో అర్హులైన ప్రతి ఆడపిల్లకు సుకన్య సమృద్ధి యోజన పథకం ప్రయోజనం అందేలా అన్ని శాఖలు సమన్వయంతోపనిచేయాలని సూచించారు. నవంబర్ నెలలోగా అర్హులైన బాలికలందరికీ సుకన్య సమృద్ధి ఖాతాల నమోదు ప్రక్రియను విస్తృత స్థాయిలో చేపట్టి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో ఎల్లయ్య,జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి గణేశ్వర్, మున్సిపల్ కమిషనర్ నవీన్ విద్యాశాఖ అధికారి రాజు, లీడ్ బ్యాంక్ మేనేజర్ బాపూజీ, ఆర్డీవో రమాదేవి, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవి, తదితర అధికారులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ డీఎస్పీగానూతన బాధ్యతలు స్వీకరించిన రమేష్

మొదటిపేజీ తరువాయి

నవంబర్ 6 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి :

కరీంనగర్ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన రమేష్ మెదక్ జిల్లా సైబర్ క్రైమ్ డీఎస్పీగా నూతన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ను మర్యాదపూర్వకంగా కలిసిమొక్కనుఅందజేశారు.ఇప్పటివరకు మెదక్ జిల్లా సైబర్ క్రైమ్ డీఎస్పీగా విధులు నిర్వహించిన సుభాష్ చంద్రబోస్ కరీంనగర్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రమేష్ నూతన బాధ్యతలు చేపట్టారు.

రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి

- భూసార పరిరక్షణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి.....- రాంపూర్‌లో కేత్ బచావో అభియాన్,

సమగ్ర సస్యరక్షణ కార్యక్రమం.. రైతులకు పంటల సాగు, నేల ఆరోగ్యంపై అవగాహన.....

కొల్చారం,నవంబర్06(ప్రజా జ్యోతి)

రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. శుక్రవారం కొల్చారం మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కేత్ బచావో అభియాన్, సమగ్ర సస్యరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూసుపోషణ, భూసంరక్షణ, పంటల సాగులో పాటించాల్సిన పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.
ఎల్‌నినో ప్రభావం కారణంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతులు





ఆరు తడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు సూచించారు. జొన్న, మొక్కజొన్న, కుసుమ, పొద్దుతిరుగుడు, అపరాల వంటి పంటలను సాగు చేయడం ద్వారా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయాన్ని కొనసాగించవచ్చని వివరించారు.రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి భూసారాన్ని కాపాడుకోవాలని అధికారులు సూచించారు. సమగ్ర పోషక యాజమాన్య పద్ధతుల్లో భాగంగా పచ్చిరొట్ట పంటలు, జీవన ఎరువులు, సూక్ష్మ పోషకాలను అవసరానికి అనుగుణంగా వినియోగించాలని తెలిపారు. వీటి ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు భూమిలో సేంద్రియ పదార్థాలను పెంపొందించుకోవచ్చని వివరించారు. మట్టి నమూనాల సేకరణ, పరీక్షల విధానాన్ని రైతులకు వివరించి, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. మట్టి పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలకు అవసరమైన పోషకాలను అందించాలని, విచక్షణారహితంగా ఎరువులు వినియోగించకుండా శాస్త్రీయ పద్ధతులను పాటించాలని సూచించారు. అలాగే పురుగుమందుల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మందులు పిచికారీ చేసే ముందు, పిచికారీ సమయంలో, అనంతరం పాటించాల్సిన భద్రతా చర్యలను వివరించారు. నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టమ్ (ఎన్ పిఎస్ఎస్) యాప్ ద్వారా పొలాల్లోని పంటలను ఆశించే పురుగులను గుర్తించి, వాటి నివారణకు తగిన రసాయన మందులపై సూచనలు పొందవచ్చని తెలిపారు. రైతులు ఈ యాప్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు వెంకటరెడ్డి, హొన్నప్పగౌడ, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఉదయశంకర్, కొల్చారం మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి, గ్రామ సర్పంచ్ నెల్లి సంగమేశ్వర్, ఉపసర్పంచ్ తంగేళ్ల శ్రీశైలం, వ్యవసాయ విస్తరణ అధికారి నిరోషా, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, గ్రామ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



మెదక్ పట్టణంలో నేడు పలు అభివృద్ధి పనులకు

ఎమ్మెల్యే చేతుల మీదుగా శంకుస్థాపన

- పట్టణ అధ్యక్షులుగంగాధర్

నవంబర్ 6 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి :

శనివారం నాడు సమయం మధ్యాహ్నం 1.00 గంటల నుండి 1,2,3,6,7,8,10,14, 15,1719,20,32 వార్డులలో సిసి రోడ్లు, మురికి కాల్వలకు శంకుస్థాపనలు చస్తారు మరియు చిల్డ్రన్స్ పార్క్ ఆధునికరణ, అంబేద్కర్ చౌరస్తా సుందరీకరణ, ధ్యాన్‌చంద్ చౌరస్తా, సుందరీకరణ, చిల్డ్రన్స్ పార్క్ అభివృద్ధి, టీచర్స్ కాలనీలో పార్క్, స్మశాన వాటికలో వసతులు, ఈ పనులన్నింటినీ మన మెదక్ శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ చేతుల మీదుగా 9-11 కోట్ల రూపాయలు నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలుచేయనున్నారు.కావున మున్సిపల్ చైర్ పర్సన్ ,వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మాజీ చైర్మన్లు మాజీ వైస్ చైర్మన్ లు ,మాజీ కౌన్సిలర్ లు,కోఫ్షన్ సభ్యులు, యువజన, మహిళా అన్ని రకాల అనుబంధ సంఘాల నాయకులు,కార్యకర్తలు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రతి ఒక్కరూ హాజరు కాగలరనీ
మెదక్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగాధర్ తెలిపారు.

భూములే లేని వారికి రెవెన్యూ అధికారుల నోటీసులు.....

“నా పేరుపై భూమి లేకున్నా నోటీసులు ఎందుకు ఇస్తున్నారు?”

అంటూ బాధితుల ఆవేదన.....










కొల్చారం,నవంబర్ 06(ప్రజా జ్యోతి)

మెదక్ జిల్లా కొల్చారం మండల పరిధిలోని ఏడుపాయల ప్రాంతం చిన్న ఘనపూర్ గ్రామ శివారులో అప్పాజీపల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్, మహేష్, ధనరాజ్ వీరి పేర్ల మీద భూమి లేకున్నా రెవెన్యూ అధికారుల నోటీసులు ఇవ్వడం వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. భూములు లేని వారికి సైతం రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేస్తుండటంతో బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పేరు మీద ఎలాంటి భూములు లేకపోయినా రెవెన్యూ అధికారులు నోటీసులు ఎలా జారీ చేస్తారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. “నా పేరు మీద భూమి లేదు.. నేను ఎలాంటి భూమిని ఆక్రమించుకోలేదు.. అలాంటప్పుడు నాకు నోటీసులు ఎందుకు ఇస్తున్నారు?” అంటూ అధికారుల తీరుపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- భూములు లేనివారికి నోటీసులు ఎందుకు...?

ఏడుపాయల పరిసర ప్రాంతంలోని ఘనపూర్ శివారులో భూములకు సంబంధించి రెవెన్యూ అధికారులు చేపడుతున్న చర్యల నేపథ్యంలో ఈ నోటీసుల వ్యవహారం తెరపైకి వచ్చింది. అయితే భూములు ఉన్నవారితో పాటు, తమ పేరు మీద ఎలాంటి భూములు లేని వారికి కూడా నోటీసులు అందుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



దీంతో బాధిత కుటుంబాలు అయోమయానికి గురవుతున్నాయి.

- రెవెన్యూ అధికారుల

విచారణలో నిర్లక్ష్యమా...?

నోటీసులు జారీ చేసే ముందు సంబంధిత వ్యక్తుల పేర్లపై భూములు ఉన్నాయా? లేవా? అనే విషయాలను రెవెన్యూ రికార్డుల ఆధారంగా పరిశీలించారా? క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భూములు లేని వ్యక్తులకు నోటీసులు అందితే వాటి వెనుక కారణాలను అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

- బాధితులకు న్యాయం

చేయాలని విజ్ఞప్తి.....

తమ పేరు మీద భూములు లేని వారికి నోటీసులు జారీ చేయడంపై ఉన్నతాధికారులు స్పందించాలని బాధితులు కోరుతున్నారు. సంబంధిత రికార్డులను పరిశీలించి, వాస్తవాలు తెలుసుకున్న తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నిరుపేదలను అనవసర ఇబ్బందులకు గురిచేయకుండా రెవెన్యూ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరుతున్నారు. అసలు భూములే లేని వారికి నోటీసులు ఎందుకు జారీ చేస్తున్నారు? రెవెన్యూ అధికారుల వద్ద ఉన్న భూ రికార్డులు ఏమి చెబుతున్నాయి? బాధితుల ఆవేదనపై ఉన్నతాధికారులు స్పందిస్తారా? ఏడుపాయల చిన్న ఘనపూర్ శివారు లో నోటీసుల వ్యవహారంపై జిల్లా అధికారులు సమగ్ర విచారణ చేపట్టి నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- అధికారుల వివరణ....

కొల్చారం మండలం చిన్నగనాపూర్ గ్రామ శివారులో రెవెన్యూ అధికారులు, చిన్నగనాపూర్ జిపిఓ, పంచాయతీ కార్యదర్శి, వివిధ గ్రామాల జిపిఓలు నోటీసులు ఇచ్చిన విషయం గురించి “ చరవాణి “ద్వారా వివరణ కోరెందుకు ప్రయత్నించగా ఎవరు కూడా స్పందించకపోవడం ఎంతవరకు సమంజసం అని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన నోటీసుల మీద నోటీస్ పైన ఏ తారీకు ఇచ్చారు అన్నది కూడా డేటు లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా కొల్చారం మండల ఎమ్మార్వో, జిల్లా సంబంధిత అధికారులు నోటీసులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని బాధితులు ఆవేదన చేశారు. ఇట్టి విషయంపై అధికారులు ఎప్పుడు స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

నెలవారీ తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ - ప్రతిమా సింగ్



నవంబర్ 6 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి :

శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్‌ను నెలవారీ తనిఖీల్లో భాగంగా సంబంధిత అధికారులు సందర్శించి తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా గోడౌన్‌లో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈ వి ఎంలు), వీవీప్యాట్ యంత్రాల భద్రత, నిల్వ ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. గోడౌన్ పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లను సమీక్షించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అన్ని జాగ్రత్తలు పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ తనిఖీలో ఎన్నికల విభాగం అధికారి గఫర్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయ స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.8.15 లక్షలు

- ఏడు నెలల హుండీ ఆదాయం రూ.8,15,516..

లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్న దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ ధర్మకర్తలు

శివ్వంపేట ప్రజాజ్యోతి

నవంబర్ 06:



శివ్వంపేట మండలం చిన్న గొట్టుముక్కుల గ్రామ పరిధిలో వెలసిన ప్రసిద్ధ స్వయంభూ శ్రీ సహకార ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఏడు నెలల కాలానికి సంబంధించిన హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. ఈ సందర్భంగా నిర్వహించిన హుండీ లెక్కింపు కార్యక్రమంలో భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకలను లెక్కించగా మొత్తం రూ. 8,15,516 ఆదాయం వచ్చినట్లు ఆలయ నిర్వాహకులు వెల్లడించారు. భక్తులు స్వామివారిపై ఉన్న అపారమైన భక్తి,విశ్వాసంతో సమర్పించిన నగదు కానుకల ద్వారా ఈ ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఏడు నెలల పాటు హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను దేవాదాయ శాఖ పరిశీలకుల పర్యవేక్షణలో పారదర్శకంగా లెక్కింపు చేపట్టారు. లెక్కింపు ప్రక్రియలో ఆలయ సిబ్బంది,సేవా సంస్థ ప్రతినిధులు,భక్తులు పాల్గొని సహకరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ పరిశీలకులు,దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త ఆంజనేయ శర్మ,కార్యనిర్వహణాధికారి సార శ్రీనివాస్, సింగాయిపల్లి నారాయణరావు,శ్రీ లలిత సేవా సంస్థ సేవకులు,పలువురు భక్తులు పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసే భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకోవడంతో పాటు హుండీలో కానుకలు సమర్పించడం విశేషం.



వ్యవసాయ క్షేత్రస్థాయి అధ్యయనానికి శివ్వంపేట గ్రామం ఎంపిక

నాలుగు నెలల పాటు గ్రామంలోనే ఉండి పంటల సాగు విధానాలు,

చీడపీడల నివారణపై అధ్యయనం చేయనున్న విద్యార్థినులు

శివ్వంపేట ప్రజాజ్యోతి నవంబర్ 06:

కృషి విజ్ఞాన కేంద్రం, తునికి--మెదక్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి విశ్వవిద్యాలయంలో వ్యవసాయ విద్య నాలుగో సంవత్సరం చదువుతున్న 17 మంది విద్యార్థినులు తమ పాఠ్య ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమం (రూరల్ అగ్రికల్చరల్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రామ్)లో భాగంగా శుక్రవారం శివ్వంపేట గ్రామాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులు నాలుగు నెలల పాటు శివ్వంపేట గ్రామంలోనే ఉంటూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పరిస్థితులు,రైతులు సాగు చేస్తున్న వివిధ రకాల పంటలు,వాటి సాగు విధానాలు,పంటలను ఆశించే చీడపీడలు,వాటి నివారణకు అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయనున్నారు. అదేవిధంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాల జీవన విధానాలు,రైతుల అనుభవాలు, వ్యవసాయంలో ఎదురవుతున్న సమస్యలు,వాటికి రైతులు అనుసరిస్తున్న పరిష్కార మార్గాలను తెలుసుకోనున్నారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్రీనివాస్ విద్యార్థినులను గ్రామానికి తీసుకువచ్చి గ్రామ సర్పంచ్ వెంకటేశ్,వార్డు సభ్యులు,స్థానిక రైతులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా



గ్రామంలో చేపట్టనున్న అధ్యయన కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం గ్రామ సర్పంచ్ వెంకటేశ్,వార్డు సభ్యులు నర్సింలు,లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ.. వ్యవసాయ విద్యార్థినులు నాలుగు నెలల పాటు గ్రామంలో ఉండి రైతుల నుంచి ప్రత్యక్షంగా వ్యవసాయ అనుభవాలను తెలుసుకోవడం మంచి విషయమని అన్నారు. విద్యార్థినులు చేపట్టే పంటల సాగు అధ్యయనం,రైతులతో



సమావేశాలు,గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే వివిధ కార్యక్రమాలకు గ్రామపంచాయతీ తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. తమ గ్రామాన్ని క్షేత్రస్థాయి అధ్యయనానికి ఎంపిక చేసి విద్యార్థినులు రావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటేశ్,వార్డు సభ్యులు నర్సింలు,లక్ష్మీ నరసయ్య,రైతులు శ్రీనివాస్,నారాయణ,కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం. శ్రీనివాస్,17 మంది వ్యవసాయ విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మెరుగు పడాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

- మార్చి నెలాఖరు నాటికి వి బి జి రామ్ జిద్వారా 12 కోట్ల పనిదినాల కల్పన లక్ష్యం

- వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఇసుక, సిమెంట్ రాయితీలను లబ్ధిదారులకు అందించాలి

నవంబర్ 6 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి :

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మెరుగుపడాలని, విద్య, వి బి జి రామ్ జి పథకం, చేయూత పింఛన్ల పరిశీలన ప్రక్రియ, తాగునీటి సరఫరా, గృహ నిర్మాణ శాఖకు సంబంధించిన అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు.శుక్రవారం, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, లక్ష్యాల సాధనపై సీఎస్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు.ఈ నేపథ్యంలో లిరాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల నిధుల వినియోగాన్ని పూర్తి స్థాయిలో చేపట్టాలని సీఎస్ సూచించారు. జనవరి మొదటి వారంలోగా ఈ రెండు పథకాల నిధుల వ్యయాన్ని గరిష్టంగా 100 శాతానికి చేరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అదనపు నిధులు విడుదల చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్, వి బి జి రామ్ జి పథకాలను సమన్వయం చేసుకుంటూ రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, విద్యాసంస్థల్లో అదనపు తరగతి గదులు, అవసరమైన మరుగుదొడ్లు, ఇతర మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు.అన్ని పాఠ శాలలను అధికారులు తరచూ సందర్శించి, అక్కడి సమస్యలను గుర్తించి, వెంటనే పరిష్కరించాలని సూచించారు. విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాలు అన్ని పాఠశాలల్లో నాణ్యతతో అమలయ్యేలా చూడాలని తెలిపారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత

వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి జిల్లాలో జిల్లా తాగునీటి కమిటీలను ఏర్పాటు చేయాలని, ఈ కమిటీల్లో జిల్లా పంచాయతీ అధికారి, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు సభ్యులుగా ఉండాలని తెలిపారు.జిల్లా కమిటీ ప్రతి వారం సమావేశమై తాగునీటి సరఫరా పరిస్థితిని సమీక్షించాలని, నవంబర్ నెలాఖరులోగా మండల స్థాయిలో కూడా కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.నవంబర్ 15వ తేదీలోగా చేతిపంపులు, బోర్ పంపులు, బహిరంగ బావులు, తదితర తాగునీటి మౌలిక సదుపాయాలకు అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తాగునీటి సరఫరాలోని సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.

వి బి జి రామ్ జి ద్వారా నాణ్యమైన పనులు చేపట్టాలి



వి బి జి రామ్ జిపథకం అమలుపై మాట్లాడుతూ.. నవంబర్ నెలలో ప్రస్తుతం రోజుకు సగటున 5.5 లక్షల మంది కూలీలు పనులు పొందుతున్నారని తెలిపారు. గత రెండేళ్లతో పోలిస్తే ఉపాధి కల్పనలో గణనీయమైన పురోగతి సాధించామని పేర్కొన్నారు. గత సంవత్సరాల్లో నవంబర్ నెలలో సగటున 25 వేల మందికి మాత్రమే పనులు కల్పించగా, ప్రస్తుతం రోజుకు దాదాపు 5.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. వి బి జి రామ్ జి ద్వారా చేపట్టే పనులు నాణ్యతతో ఉండాలని, మార్చి నెలాఖరు నాటికి 12 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని, సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. అవసరమైన కొత్త సోషల్ మీడియా ఖాతాలను ప్రారంభించి, తగిన హ్యాష్‌ట్యాగ్‌లతో ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి:

దీపావళి పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం ప్రారంభించిన “మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి” కార్యక్రమంలో భాగంగా పూర్తయిన అన్ని ఇందిరమ్మ ఇళ్లకు కొత్త లోగోతో కూడిన స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో నిర్వహించే వేడుకలను సోషల్ మీడియా ఖాతాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో ఇప్పటివరకు కేవలం 43 వేల ఇళ్లకు మాత్రమే మంజూరు చేయడం జరిగిందని, ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీలతో కలెక్టర్లు సమన్వయం చేసుకుంటూ ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సిమెంట్ బస్తాను రూ.230 చొప్పున సరఫరా చేయాలని, ఒక్కో బస్తాపై లబ్ధిదారుడికి రూ.100 ప్రయోజనం కలుగుతుందని, మొత్తం సుమారు రూ.50 వేల వరకు ప్రయోజనం అందే అవకాశం ఉందని తెలిపారు. సబ్సిడీ సిమెంట్ బస్తాల ద్వారా లబ్ధిదారులకు కలిగే ప్రయోజనం పూర్తిస్థాయిలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇళ్ల నిర్మాణాల పురోగతిని వేగవంతం చేసేందుకు క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తూ, ప్రతి వారం సమీక్ష ద్వారా నిర్మాణాల పురోగతిని పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి వారం ఒక్కో ఏఈకి 20 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడంతో పాటు, బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న ఇళ్లను పైకప్పు స్థాయికి తీసుకువచ్చేలా లక్ష్యాలను



నిర్దేశించినట్లు తెలిపారు.ఈ లక్ష్యాల సాధన కోసం ప్రత్యేకంగా అంతర్గత డ్యాష్ బోర్డును రూపొందించి, దాని ద్వారా ప్రతి ఇంటి నిర్మాణ పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో లిజిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్‌లిమాట్లాడుతూ.. పీఎం శ్రీ పాఠశాలల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.పాఠశాలల్లోని గ్రంథాలయాల్లో విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించే ఎన్‌సైక్లోపీడియాలు, అట్లాస్‌లు, ఇంగ్లీష్ పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. నోబెల్ బహుమతి పొందిన సాహిత్య రచయితల పుస్తకాలు, మ్యాన్ బుకర్ ప్రైజ్, మ్యాన్ బుకర్ ఇంటర్నేషనల్ అవార్డు పొందిన రచయితల పుస్తకాలతో పాటు ప్రముఖుల జీవిత చరిత్రలు, స్వీయ జీవిత చరిత్రలను, ప్రముఖ రచయితల పుస్తకాలతో విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేలా పుస్తకాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అదనంగా ఇంగ్లీష్ పుస్తకాలను సమకూర్చాలని సూచించారు.పీఎం శ్రీ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, వచ్చే వారం నాటికి పనుల పురోగతిపై స్పష్టమైన నివేదిక అందించాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థులను ప్రోత్సహించేలా ప్రతీ 45 రోజులకు ఒకసారి పరీక్షలు నిర్వహించాలని, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ఐప్యాడ్‌లను బహుమతులుగా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో వ్యక్తిగత ఇంకుడు గుంతలు, బోర్ వెల్ రీఛార్జ్ నిర్మాణాలు, పంట కుంటల (ఫామ్ పాండ్స్) నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదే విధంగా భూసేకరణ ప్రక్రియలో పెండింగ్ అంశాలను పరిష్కరించలన్నారు.ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. చేయూత పింఛన్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పరిశీలన ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జలసిరి పథకం కింద జిల్లాలో పనుల గ్రౌండింగ్‌లో రాష్ట్రంలో మూడో స్థానంలో ఉన్నప్పటికీ, పనుల పూర్తిపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సూచించారు. వాటిని త్వరగా పూర్తి చేసి, నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ నగేష్,జెడ్పీ సీఈవో ఎల్లయ్య , డి ఆర్ వో అంబాదాస్ రాజేశ్వర్ డిఆర్డిఓ శ్రీనివాసరావు,జిల్లా విద్యాధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎండి పోయిన పంటలకు నష్టపరిహారం అందజేయాలి

- పంటలను పరిశీలించిన ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి హరీష్ రావు

చింతా ప్రభాకర్

నవంబర్ 6 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి :

నర్సాపూర్ నియోజక వర్గంలోని చిలిపిచెడ్ మండలం ఫైజాబాద్ గ్రామం, హత్నూర మండలం లక్ష్మా తండా నస్తీపూర్ గ్రామాల్లో ఎండిపోయిన వరి పంటలను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు , నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి ,సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరిశీలించి, పంట నష్టపోయిన రైతులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఎండిపోయిన పంటలకు తక్షణమే పంట నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.





కల్వర్‌లో రేపటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..

- కోడి గంగారాం సర్పంచ్.

- లబ్ధిదారులు అవసరమైన పత్రాలతో గ్రామ పంచాయతీ కార్యాలయానికి రావాలి

కల్వర్, నవంబర్ 6, ప్రజాజ్యోతి:

తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన నూతన స్మార్ట్ రేషన్ కార్డులు కల్వర్ గ్రామ పంచాయతీకి చేరుకున్నాయని సర్పంచ్ కోడి గంగారం, ఉప సర్పంచ్ పెరుమండ్ల మహేష్ తెలిపారు. ఈ నేపథ్యంలో నవంబర్ 7వ తేదీ నుంచి గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.కార్డులు పొందా లనుకునే లబ్ధిదారులు పాత రేషన్ కార్డు జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు కుటుంబ పెద్ద ఆధార్ కార్డు ఒరిజినల్‌ను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. కల్వర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్డుల పంపిణీ కొనసాగుతుందని పేర్కొన్నారు.కార్డుదారులు తప్పనిసరిగా స్వయంగా గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చి తమ స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకోవాలని, ఇతర వ్యక్తులకు కార్డులు అందజేయడం జరగదని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది కోరారు.

ఆంగ్ల పదజాలంపై పట్టు సాధించేలా విద్యార్థులకు ప్రోత్సాహం

- 546 మంది విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీల పంపిణీ







వెల్దుర్తి (ప్రజాజ్యోతి) నవంబర్ 06:

వెల్దుర్తి: విద్యార్థులు ఆంగ్ల భాషను సులభంగా నేర్చుకోవడంతో పాటు స్వయంగా పదాల అర్థాలను తెలుసుకునే అలవాటు పెంపొందించాలనే ఉద్దేశంతో వెల్దుర్తి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీల పంపిణీ చేపట్టారు. పాఠశాలలో చదువుతున్న 546 మంది విద్యార్థులకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మాధురి, హెచ్ఎం బి. సాంబయ్య చేతుల మీదుగా ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీల అందజేశారు.విద్యార్థులు భాషపై పట్టు సాధించేందుకు పుస్తక పఠనంతో పాటు నిఘంటువులను ఉపయోగించడం కూడా అలవాటు చేసుకోవాలని ఈ సందర్భంగా సాంబయ్య సూచించారు. ఆంగ్ల పదాలకు తెలుగు అర్థాలు తెలుసుకునే అవకాశం ఉండటంతో ఈ డిక్షనరీలు విద్యార్థుల అభ్యసనకు చక్కటి సాధనంగా నిలుస్తాయని చెప్పారు.ఒక పదాన్ని నేర్చుకోవడంతో సరిపెట్టకుండా దాని అర్థాన్ని గ్రహించి, సందర్భానుసారంగా వాక్యాల్లో ప్రయోగించాలని సూచించారు. ఇలా నిరంతరం సాధన చేయడం వల్ల ఆంగ్లంలో మాట్లాడే ధైర్యం, రాయగల సామర్థ్యం, చదివి అర్థం చేసుకునే నైపుణ్యం మెరుగుపడతాయని వివరించారు.విద్యార్థులకు తరగతి గది బోధనతో పాటు అదనపు అభ్యసన అవకాశాలు కల్పించడం ద్వారా మెరుగైన విద్యా ఫలితాలు సాధించవచ్చని, ఈ దిశగా పాఠశాలలో వినూత్న కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రధానో పాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు, బాలికల భద్రతకు పెద్దపీట వేయాలి

- షీ టీం, భరోసా కేంద్రా లను తనిఖీ చేసిన అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్





నవంబర్ 6 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి :

మహిళలు, బాలికల భద్రత కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ పోలీసు సిబ్బందికి సూచించారు. శుక్రవారం జిల్లా షీ టీం, భరోసా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షీ టీం పనితీరు, ఇప్పటివరకు నమోదు చేసిన కేసులు, అందిన ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యలను సమీక్షించారు. సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, ఎప్పటికప్పుడు నవీకరించాలనిఆదేశించారు.మహిళలు, బాలికలను వేధించే ఆకతాయిలపై నిరంతరం నిఘా ఉంచాలని, బస్టాండ్లు, కళాశాలలు, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. విద్యాసంస్థల్లో మహిళల భద్రత, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వేధింపులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించా లన్నారు.అనంతరం భరోసా కేంద్రాన్ని సందర్శించి బాధితులకు అందిస్తున్న సేవలు, కౌన్సెలింగ్, ఫిర్యాదుల పరిష్కార విధానాలను పరిశీలించారు. బాధితులకు భరోసా కల్పిస్తూ, వారి వివరాల గోప్యతను కాపాడాలని, సానుభూతితో వ్యవహరిస్తూ సత్వర న్యాయం అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు.ఈ తనిఖీలో భరోసా ఎస్ఐ సుచరిత, భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, భరోసా కేంద్రం సిబ్బంది, షీ టీం సిబ్బంది పాల్గొన్నారు.

కౌడిపల్లి నూతన ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రెస్ క్లబ్ ప్రతినిధులు

నవంబర్ 6 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి:

మెదక్ జిల్లా కౌడిపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై నూతనంగా వచ్చిన ఎస్సై నిరేష్‌ను రామానంద చటర్జీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై నిరేష్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ, కౌడిపల్లి మండలంలో పోలీస్ శాఖకు, పాత్రికేయులకు మధ్య సత్సంబంధాలు, పరస్పర సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజలకు సంబంధించిన ముఖ్యమైన సమాచారాన్ని వార్తల రూపంలో వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు.అదేవిధంగా మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ చేపట్టే కార్యక్రమాలకు పాత్రికేయులుగా తమ వంతు సహకారం అందిస్తామని ప్రెస్ క్లబ్ సభ్యులు తెలిపారు. ప్రజలకు, అధికారులకు మధ్య సమాచార వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా నూతన ఎస్సై నిరేష్‌తో ప్రెస్ క్లబ్ సభ్యులు కొద్దిసేపు ఆత్మీయంగా మాట్లాడి పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. భవిష్యత్తులో కూడా పోలీస్ శాఖతో సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ వార్తా కథనాలు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రామానంద చటర్జీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజుతో పాటు ప్రెస్ క్లబ్ సభ్యులు శ్రీశైలం పాల్గొన్నారు.



ఎల్ నినో ప్రభావంతో తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలి

– ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి

– భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

– కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో లబ్ధిదారులతో దీపావళి వేడుకలు నిర్వహించాలి

– ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు





సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :-

ఎల్ నినో ప్రభావంతో భవిష్యత్తులో తలెత్తే నీటి ఎద్దడి, కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమిష్టిగా కృషి చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.శుక్రవారం హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా, గృహ నిర్మాణం, వీబీ-జీ రామ్ జీ, చేయూత పింఛన్లు, భూసేకరణ, సివిల్ వర్క్స్ పురోగతి తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో చేతిపంపుల మరమ్మతులు చేపట్టడంతో పాటు, పైప్‌లైన్ లీకేజీలను వెంటనే అరికట్టాలని ఆదేశించారు. నీటి సంరక్షణలో భాగంగా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు, బోరుబావుల వద్ద సోక్‌పిట్లు, బోరుబావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టి భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని సూచించారు.వీబీ-జీ రామ్ జీ పథకం కింద ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కూలీలకు ఉపాధి కల్పించాలని తెలిపారు. జలసిరి పనులను విస్తృతంగా చేపట్టడం ద్వారా నీటి సంరక్షణకు మరింత దోహదపడాలని సూచించారు.చేయూత పథకం కింద కొత్తగా అందిన పింఛన్ దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా, పారదర్శకంగా పరిశీలించి అర్హులైన లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. రెండో విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని సూచించారు. నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో లబ్ధిదారులు ఈ దీపావళి పండుగను జరుపుకునేలా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.అలాగే, పీఎం శ్రీ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టులతో పాటు ఇతర ప్రభుత్వ అవసరాలకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి జిల్లా నుంచి అదనపు కలెక్టర్లు టి.ఎల్. సంగీత, ఆర్. పాండు, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, డీఆర్‌డీఏ శాఖల అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగర్ చెరువులో మొసళ్ల కలకలం!

చెరువుకట్టపై సంచరిస్తున్న మొసళ్లు..

భయాందోళనలో స్థానికులు

కొండాపూర్ ప్రజా జ్యోతి

కొండాపూర్ మండల పరిధిలోని అనంతసాగర్ చౌదరి చెరువులో మొసళ్లు ప్రత్యక్షమవుతుండటంతో స్థానిక గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం చెరువుకట్ట మీదుగా మారేపల్లి గ్రామానికి రాకపోకలు సాగించే ప్రజలు, పొలాలకు వెళ్లే రైతులు మొసళ్ల సంచారంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.చెరువులోని మొసళ్లు అప్పుడప్పుడు బయటకు వచ్చి సంచరిస్తుండటంతో రైతులు, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో మొసళ్లు చెరువుకట్టపైకి వచ్చి చేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లేవారు, మారేపల్లి గ్రామానికి రాకపోకలు సాగించేవారు మొసళ్లను చూసి భయంతో వెనుదిరుగుతున్న పరిస్థితి ఏర్పడింది.మరోవైపు చెరువులో చేపల వేట కొనసాగించే మత్స్యకారులు సైతం మొసళ్ల సంచారంతో తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలి!లి

ఇప్పటికైనా సంబంధిత అటవీశాఖ, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి చెరువులో మొసళ్ల సంచారాన్ని పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అవసరమైన నిపుణుల సహాయంతో మొసళ్లను సురక్షితంగా పట్టుకొని తగిన ప్రాంతానికి తరలించడంతో పాటు, చెరువుకట్ట వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఏదైనా ప్రాణనష్టం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే చర్యలు తీసుకోవాలని అనంతసాగర్ గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు, ప్రజలకు తీరని నష్టం

- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం

- రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలి



జహీరాబాద్, నవంబర్ 06 (ప్రజా జ్యోతి న్యూస్)

ఎల్‌నినో ప్రభావంతో ఈ వర్షాకాలం లో సరైన వర్షాలు కురవకపోవడంతో జహీరాబాద్ నియోజక వర్గంతో పాటు సంగారెడ్డి జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. సాధారణ వర్షపాతంతో పోలిస్తే వాస్తవ వర్షపాతం గణనీయంగా తగ్గిపోయింది. ఫలితంగా చెరువులు, కుంటల్లో నీరు లేక అనేక చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. భూగర్భ జలమట్టం కూడా భారీగా పడి పోయింది. ఈ పరిస్థితులన్నీ ప్రభుత్వ ముందస్తు ప్రణాళిక,నీటి నిర్వహణలో నిర్లక్ష్యం మండలాల వారీగా వర్షపాతం వివరాలు చుస్తే జహీరాబాద్ నియోజక వర్గంలోని ఐదు మండలాల్లో సాధారణ వర్షపాతం, వాస్తవ వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. న్యాల్కల్ మండలంలో సాదారణ వర్షం పాతం 611.8 మీ మీ -వాస్తవ వర్షపాతం 377.4మీ.మీ, జహీరాబాద్ మండలంలో సా.వర్షపాతం 684.4 మీ. మీ-వా.వర్షా పాతం 272.5 మీ.మీ, మొగుడంపల్లి మండలంలో సా.వర్షపాతం 699.1మీ. మీ-వా.వర్షపాతం 482.7, కోహీర్ మండలంలో సా.వర్షపాతం 611.4-వా. వర్షపాతం 309.6, ఝరాసంగం మండలంలో సా.వర్షపాతం 597.9 -వా. వర్షపాత 383.4, సంగారెడ్డి జిల్లా సాధారణ సగటు వర్షపాతం 772.2 మి.మీ. కాగా, వాస్తవంగా కురిసింది కేవలం 569.3 మి.మీ. మాత్రమే. అంటే 202.9 మి.మీ. వర్షపాతం లోటు, సుమారు 26.3 శాతం నమోదైంది.వర్షాభావ పరిస్థితుల కారణంగా చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు లేకుండా పోవడంతో భూగర్భ జలాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సంగారెడ్డి జిల్లాలో గతంలో సగటున 6.26 మీటర్ల లోతులో లభించిన భూగర్భ జలాలు ప్రస్తుతం 12.96 మీటర్ల లోతుకు వెళ్లాయి. దీంతో బోరు బావులపై ఆధారపడే రైతులకు సాగునీటి సమస్య తీవ్రంగా మారింది. జహీరాబాద్ ప్రాంతంలో ప్రధానంగా సాగు చేసే చెరుకు, పత్తి, సోయాబీన్, మొక్కజొన్న, ఆలుగడ్డ,పంటలకు నీటి కొరత ఏర్పడటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులు దిగుబడులు తగ్గిపోతాయనే ఆందోళనలో ఉన్నారు. ముఖ్యంగా చెరుకు వంటి దీర్ఘకాలిక పంటలకు నీటి కొరత ఏర్పడి రైతులకు భారీ ఆర్థిక నష్టం తప్పదం లేదు. సింగూర్ లో మరమ్మత్తుల పేరుతొ ఉన్న నీటిని ఖాళీ చేయడంతో 30 టీఎంసీల సామర్థ్యం ఉన్న సింగూరులో మిగిలింది 2.5 టీఎంసీలే!ఇది ప్రభుత్వ అన్నాలోచిత నిర్ణయానికి నిదర్శనం సంగారెడ్డి జిల్లాకు తాగునీరు, సాగునీటి భద్రత కల్పించడంలో కీలకమైన సింగూరు ప్రాజెక్టు పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. సుమారు 30 టీఎంసీల పూర్తి నిల్వ సామర్థ్యం ఉన్న సింగూరు ప్రాజెక్టులో ప్రస్తుతం కేవలం 2.5 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని తెలుస్తోంది. ఇందులో సుమారు 0.8 టీఎంసీలు డెడ్ స్టోరేజీగా ఉంటే, వినియోగానికి అందు బాటులో ఉండేది కేవలం 1.7 టీఎంసీలు మాత్రమే. వర్షాభావ పరిస్థితులు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిసినప్పుడు సింగూరు ప్రాజెక్టు గేట్లు, కాలువలు, పంపులు తదితర వ్యవస్థల మరమ్మతులను ముందు గానే చేపట్టి ఉండాల్సింది. గోదావరి నదిలో అందు బాటులో ఉన్న నీటిని ప్రభుత్వం రాజకీయ కారణాలతో బీఆర్ఎస్ ప్రభుత్వానికి పేరు వస్తుందనే భావనతో అందుబాటులో ఉన్న నీటిని వినియోగించు కోకుండా వదిలేశారు, ప్రభుత్వ అసమర్థత వల్ల నీటి వనరులు తగ్గిపోయాయి కాబట్టి రైతులు ప్రజలు బాగా ఆలోచించి అధిక నీటి అవసర మున్న పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలను ప్రోత్సా హించాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియో గించుకోవాలి. ముందస్తు ప్రణాళిక లేకుండా చివరి నిమిషంలో స్పందించడం వల్ల రైతులకు,ప్రజలకు జరిగే నష్టాన్ని నివారించ లేమని అన్నారు,ప్రభుత్వం స్పందించి నష్ట పోయిన రైతులకు వెంటనే నష్ట పరిహారం అందివ్వాలని డిమాండ్. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు శివకుమార్, యం.మల్లేశం, పాల్గొన్నారు.

ఎల్నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

- రైతులకు సూచించిన ఏఈఓ సాయిలు





కల్హేర్, నవంబర్ 6, ప్రజాజ్యోతి:

ఎల్నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు సంభవించే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని, వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేసే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని ఏఈఓ సాయిలు సూచించారు. గురువారం కల్హేర్ మండలంలోని రాపర్తి గ్రామ పంచాయతీ పరిధిలో రైతులతో సమావేశం నిర్వహించి పంటల సాగుపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో వర్షపాతం, నీటి లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలు సాగు చేయాలన్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని శనగ, కుసుమ, కందులు, పెసర వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ తక్కువ పెట్టుబడితో మెరుగైన దిగుబడులు సాధించేలా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని కోరారు. గ్రామ సర్పంచ్ డి. జైపాల్ మాట్లాడుతూ .. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా ముందస్తుగా అందిస్తున్న సూచనలను రైతులు తూచా తప్పకుండా పాటించాలని కోరారు. వరికి బదులుగా ఆరుతడి పంటలను సాగు చేసి నీటి వృథాను అరికట్టడంతో పాటు కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రతి రైతు తనవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే పశువుల మేత కొరతను నివారించేందుకు రైతులు తమ పొలాల వద్ద పశు గ్రాసం సాగు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.